


ఓ రోజు సాయంత్రం బీచ్‌లో...

"హల్లో, బాగున్నారా?"

"బాగానే ఉన్నాను"

"నిన్న కూడా ఇక్కడే కలుసుకున్నాం. గుర్తుందా?" అన్నాడతను ఆనందంగా.

"మిమ్మల్ని మరిచిపోతానా? అందుకే ఇవాళకూడా ఇక్కడే కలుసుకున్నాం" అందామె నవ్వుతూ.

"ఐస్‌క్రీం తీసుకుందామా?"

"తప్పకుండా"

రెండు ఐస్‌క్రీం...డబ్బులివ్వడానికి స్పీట్ ఫైట్...అతనే ఇచ్చాడు.

"ఇక్కడ కూర్చుందామా?"

"వద్దొద్దు. ఎదురుగా వాళ్లిద్దరూ చూడండి. కట్‌డ్రాయర్లతో. బార్బరస్ వెధవలు"

కొంచెం దూరం వెళ్ళి కూర్చున్నారిద్దరూ. నీళ్ళ భయం వున్న ఒక లావుపాటి జంట...వారి పిల్లలు... నీళ్ళలో ఆటలాడుతున్నారు. ఎవరో ఒంటరి మనిషి సముద్రంలో తన భవిష్యత్తు పారేసుకున్నట్టు వెదుక్కుంటున్నాడు.

"రోజూ ఇక్కడికి వస్తుంటారా?" అడిగాడతను.

"వస్తుంటాను. నేచురల్ బ్యూటీ అంతా ఇక్కడే ఉంది."

"పొల్యూషన్ కూడా" అన్నాడతను నీళ్ళవైపు చూస్తూ.

"మీరూ రోజూ వస్తుంటారా?" అడిగిందామె.

"అప్పుడప్పుడూ...ముఖ్యంగా మీలాంటివాళ్ళు కనిపించినప్పుడు."

ఆమె చిన్నగా నవ్వి అతనివైపు చూసింది తలతిప్పకుండా. అమితాబ్ హెయిర్ స్టైయిల్, అంబాసిడర్ షూ, మెడలో చెయిన్, షర్టు మధ్యవించి రొమ్ము




మీద దట్టంగా వెంట్రుకలు, పొడుగాటి ముక్కు, కమల్ హాసన్ మీసాలు...రాగిరంగు కలిసిన తెలుపు... స్మార్ట్ అండ్ చామింగ్.

"ఏమిటే అలా చూస్తున్నారు?"

"ఏవీ లేదు"

"ఏవీ లేకపోతే చూడ్డం ఎందుకు?"

రెండు క్షణాలు నవ్వులు. ఆమెవైపు సూటిగా చూశాడతను. నవ్వు బాగుంది. ఆడవాళ్ళ పళ్ళెపుడూ తెల్లగానే ఉంటాయి. సిగరెట్లు కాల్చకపోవడంవల్ల నేమో? గొప్ప సత్యం కనిపెట్టినట్టు గర్వించాడతను. అందంగానే ఉంది. సెలయేరు అందం లేదుకాని పంటకాలవ అందం ఉంది. చీరె బాగుంది. చీరె కట్టు కోవడంలోనే అందం అంతా ఉంది. ఈమెకి ఆ కిటుకు తెలిసినట్టుంది . మెళ్ళో సన్నని గొలుసు, చెవులికి రింగులు...తల కదిలినప్పుడు రింగులు ఊగడం తనకి చాలా ఇష్టం...ముక్కు కొంచెం పొట్టి...పరవాలే దు...తన అభిమాన హీరోయిన్ ముక్కు కూడా పొట్టే...చేతికి, కాళ్లమీద వెంట్రుకలు లేవు...తన మేనకోడలికి వళ్ళంతా జుట్టే...దాన్నందుకే మీసాల సుందరని పిలుస్తాడు తను. దానికి చెస్టు తక్కువే... ఈమెది బాగుంది...స్మార్ట్ అండ్ చామింగ్...

సినిమా థియేటర్ ముందు...

"మీరు సినిమాకి వచ్చారా?" అందామె ఆశ్చర్యంగా.

"ఏం రాకూడదా?"

"రాకూడదని కాదు...భలే యాక్సిడెంటల్‌గా కలుసుకున్నాం"

"మీరొస్తారని నాకు తెలుసు!"

"ఎలా" ఆమె గొంతులో అవసరానికి మించిన ఆశ్చర్యం.

"నాకు టెలిపతీ తెలుసు" అన్నాడతను.

"గుడ్...ఏ ఉద్యోగం దొరక్కపోతే బాబా అవతారం ఎత్తొచ్చు."

రెండు క్షణాలు నవ్వులు

"మీతో ఎవరూ రాలేదా?"

"రాలేదు"

"నేనూ అంతే. ఒక్కణ్నే వచ్చాను."

"ఎవరైనా పక్కన కూర్చొని కామెంట్ చేస్తుంటే నాకు మహా చిరాకు."

"నాకూ అంతే. మా ఫ్రెండ్స్ వెధవలు వాళ్ళు సినిమా చూడరు, మనల్ని చూడనివ్వరు."

"టికెట్లు తెస్తాను."

"ఇవాళ ఖర్చునాదే" అందామె.

"ఆడాళ్ళచేత ఖర్చుపెట్టించడం..."

"అన్ డెమొక్రటిక్ కాదు" పూర్తి చేసిందామె. మళ్ళీ నవ్వులు... ఆమె టికెట్లు తెచ్చింది. ఇద్దరూ బాల్కనీ మెట్లు ఎక్కారు. హాల్లో చీకటిగా ఉంది.

"జాగ్రత్త..."

"పర్వాలేదు. ఎక్కువగా ఈ థియేటర్‌కే వస్తుంటాను" అందామె. ఇద్దరూ కూర్చున్నారు.

"మిమ్మల్ని దగ్గరికొచ్చేదాకా గుర్తుపట్టలేదు నేను" అన్నాడతను.

"ఎందుకని?"

"చీరె మార్చారు కదా?"

"రోజూ యూనిఫాంలాగా ఒకే చీరె కట్టుకోనా?" నవ్విందామె. మళ్ళీ తనే అడిగింది.

"మీకేరంగు ఇష్టం?"

"నీలం."

ఇంట్రవెల్లో పాప్‌కారన్, కూల్‌డ్రింకులూ... సినిమా అయిపోయింది.

"ఓ విచిత్రం గమనించారా?" అడిగాడతను.

"ఏమిటది?"

"సినిమా అయిపోయేదాకా మీ చెయ్యి నా చేతిలోనే ఉంది."

"నాకూ తెలుసు" ముసిముసిగా నవ్విందామె.

"రేపు మీకేదైనా ప్రోగ్రాం ఉందా?"

"లేదు"

"అయితే మునిసిపల్ పార్కులో కలుసుకుందాం."

"తప్పకుండా."

నెట్లు, సిమెంటు బెంచీలు లేని మునిసిపల్ పార్కులో, నీలం రంగు డ్రస్సులో కనిపించిందామె.

"రాత్రంతా నిద్ర పట్టలేదు నాకు" అన్నాడతను.

"ఎందుకని?"

"మీరే కనిపించారు"

"అదేం నాతప్పుకాదు. నా పరిస్థితీ అంతే"

"అది మాత్రం నాతప్పా?"

"ఇద్దరిదీ ఫిఫ్టీ ఫిఫ్టీ తప్పు" అందామె. "ఇవాళ మీకు ఆఫీసు లేదా?"

"ఉంది. దేశంలో రోడ్లు, భవనాలున్నంతకాలం మాకు ఆఫీసు ఉంటుంది."

"ఆర్ అండ్ బీలో పనిచేస్తున్నారా?" అడిగిందామె. అతను తలూపాడు.

"పోస్టేమిటి?"

"ఇంజనీర్" అన్నాడతను. ఆమె మొహం వికసించింది. అతనెక్కడ పనిచేస్తున్నాడో తనకి తెలిసిపోయింది. ఇవాళ ఈ విషయం తెలుసుకోవాలని ఇంటి దగ్గరే అనుకుంది. ఇదుగో ఇప్పుడే తెలిసిపోయింది.

"మీ రెక్కడ పని చేస్తున్నారు?"

"కిసాన్ ఫర్టిలైజర్స్‌లో స్టెనోగా"

"మీరు ఉద్యోగం చేస్తున్నారని అనుకోలేదు" అన్నాడతను నవ్వుతూ. ఆమె ఉద్యోగం చేస్తుంది. అదిచాలు తనకి. మగాడొక్కడూ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించే రోజులు ఎప్పుడో వెళ్ళాయి...మిగతా విషయాలు కూడా తెలుసుకోవాలి.

"ఏమనుకున్నారు నన్నుచూసి?"

"బాగా డబ్బున్న తండ్రికి ఏకైక పుత్రికారత్నం అనుకున్నాను."

"అంత మరీ డబ్బున్నవాళ్ళంకాదు. మా నాన్న ఆ కంపెనీలోనే మేనేజర్."

"అంటే ప్రాపర్ ఛానల్ ద్వారా వెళ్ళారన్నమాట"

"అవును" అందామె నవ్వుతూ.

"మీకు అన్నదమ్ములున్నారా?"

"లేరు. ముగ్గురం అమ్మాయిలమే. మా అక్కలిద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. నేనే లాస్ట్"

"అయితే మంచి కట్నం ఇస్తారు మీ ఫాదర్" అన్నాడతను చాలా కాజువల్‌గా.

"అదో సమస్యకాదు"

"నా పొజిషనూ అంతే. ఇద్దరమే అన్నదమ్ములం. మావాడు హైదరాబాద్‌లో వుంటున్నాడు. ఇక నేనొక్కణ్నే. ఆడపిల్లలు లేరు...థాంక్ గాడ్, మనిద్దరికీ బాదరబందీ లేదు. తమ్ముళ్ళనీ, చెల్లెళ్లనీ చదివించడం, పెళ్ళిళ్ళు చెయ్యడం లాంటి గొడవలేం లేవు."

"మీ నాన్న ఏం చేస్తుంటారు?" అడిగిందామె.

"ఆయన మీకు తెలీదా?"

"తెలీదు"

"కోటేశ్వరరావు పేరు విన్లేదా?"

"ఏ కోటేశ్వరరావు?"

"ఆడాళ్ళు రాజకీయాలు పట్టించుకోరు. మా

ఫాదర్...పార్టీ జిల్లా ప్రెసిడెంటు''

"ఓ సారీ. ఆయన పేరు విన్నానుగాని ఆయనే మీ నాన్నని తెలీదు నాకు''

కోటేశ్వరరావు కొడుకుతో పరిచయం అయినందుకు ఆమె చాలా సంతోషించింది. తనకిప్పుడు ఇంకో సమస్య కూడా పరిష్కారం అయిపోయింది. అదేమిటంటే తామిద్దరి కులాలు, కలాలు కూడా ఒక్కటే...

"డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగంలో చేరారా?'' అడిగాడతను.

"అవును. నిరుద్యోగం నా అనుభవంలోకి రాలేదు'' అందామె గర్వంగా. అతను తృప్తిగా నిట్టూర్చాడు, ఆమె పోస్ట్ గ్రాడ్యుయేట్ కానందుకు.

"నేనూ అంతే. ఇంజనీరింగ్ పూర్తయింది. మా నాన్నగురించి తెలుసు కదా. సీటు, చదువు, ఉద్యోగం అన్నీ చకచకా జరిగిపోయాయి.''

"ఇక వెళ్దామా! చీకటి పడుతోంది''

"వెళ్దాం'' అన్నాడతను. రోడ్డుమీదికొచ్చి ఆటో ఆపాడు.

ఇద్దరూ కూర్చున్న తర్వాత అడిగిందామె.

"రోజూ ఆఫీసుకి ఎలా వెళ్తున్నారు? ఆటోలోనా?''

"ఛఛ...ఆటోల్లో వెళ్ళడమా! స్కూటరుంది నాకు. రిపేరుకిచ్చి నాలుగు రోజులైంది. మెకానిక్ పెళ్ళిచేసుకుంటున్నాడు. ఇంకో వారందాకా అది బైటికి రాదు'' అన్నాడతను.

"వెహికిల్ ఉంటే ఏ సమస్యా ఉండదు. సిటీ బస్సుల్లో, ఆటోల్లో వెళ్ళడం చిరాకు నాకు'' అందామె రష్‌గా ఉన్న బస్సులో పుట్‌బోర్డుమీద నిలబడి ఉన్నట్టు మొహం పెట్టి.

"నాకూ అంతే. ఇంత వరకు సిటీ బస్సెక్కలేదు నేను''

ఆమె నవ్వుతూ తలూపింది. స్కూటర్ ఉందో లేదోనని బెంగపడింది తను. అతనికి చదువు, అందం, ఉద్యోగం, స్టేటస్ అన్నీ ఉన్నాయి.

"ఎవరతను?'' అడిగాడు కిసాన్ ఫర్టిలైజర్స్ మేనేజర్ తన కూతుర్ని.

"ఇంజనీరు–ఆర్ అండ్ బీలో.''

"అతని తండ్రి పేరేమిటి?''

"కోటేశ్వరరావు...పార్టీ జిల్లా ప్రెసిడెంటు''

"గుడ్...ఎలా ఉంటాడతను?''

"స్మార్ట్ అండ్ చార్మింగ్, డాడీ''

"రైట్...కోటేశ్వరరావంటే ఇంటిపేరేమిటి?''

"......''

"నో ప్రాబ్లెమ్. మనవాళ్ళే...ఏదో దూరపు బంధుత్వం కూడా ఉంది. కట్నం కూడా సమస్య కాదు. గో‌ఎహెడ్ బేబీ!''

"ఎవరా అమ్మాయి?''

"కిసాన్ ఫర్టిలైజర్స్ మేనేజర్ కూతురు''

"గుడ్...ఆయనతో పరిచయం ఉంది నాకు. మొన్న న్యూ ఇయర్ రోజున పార్టీలో కలుసుకున్నాం... బాగా సంపాయించాడు...పలుకుబడి కూడ ఉంది''

"ఏం చదివిందా అమ్మాయి?''

"డిగ్రీ.''

"అందంగా ఉంటుందా?''

"బ్యూటిఫుల్...నా కళ్ళకి అలాగే కనిపిస్తుందని అనకండి. నా శత్రువులు కూడా ఒప్పుకున్నారు''

"అయితే అందగత్తె గ్యారంటీగా'' అన్నాడు కోటేశ్వరరావు.

"కట్నం కూడా వాళ్ళకో సమస్యకాదు''

"ఇళ్ళ ప్లాట్లు చాలా ఉన్నాయి ఆ మేనేజర్‌కి. ఇలా వెనకా, ముందూ ఆలోచించి ప్రేమలోకి దించితే గొడవేం ఉండదు. ఎవరో బీద అమ్మాయిని లవ్ చెయ్యకుండా...ప్రొసీడ్ మై బోయ్...''

డైరీ పేజీలు తిప్పిందామె. తను ఎందర్ని లవ్ చేసిందో చూసి కొంచెం ఆశ్చర్యపడింది.

"రఘునాథ్...తన ఆఫీసులోనే పనిచేస్తుంటాడు... గుమాస్తా...అందం, చదువు ఉన్నాయికాని ఆస్తీ స్టేటస్ లేవు. ఒకే పాంటూ, షర్టూ వారం రోజులు వేస్తాడు. అతన్ని చూడగానే వీడు బీదవాడండీ అని ఎవరైనా వెంటనే చెప్పగలరు. ఉద్యోగం కూడా డొమెస్టిక్‌గానే చేస్తున్నాడు. పైకి వెళ్ళే లక్షణాలేం లేవు...అందుకే అతన్ని వదిలేసింది తను.

"సుధాకర్...ఆస్తీ స్టేటస్ ఉన్నాయి. అతని తండ్రికి జువెలరీ షాపు, పెద్ద హోటల్, ఒక సినిమా హాలు ఉన్నాయి. కాని అతనికి చదువు లేదు. మూడు సార్లు ఇంటర్ తప్పగానే తండ్రి అతన్ని బిజినెస్‌లో పెట్టేశాడు. చదువూ, అందం లేనివాణ్ణి ఎలా ప్రేమించడం?

చంద్రశేఖర్...ఆశయాల మనిషి...చదువు, అందం, ఆస్తీ స్టేటస్ అన్నీ ఉన్నాయి కాని, ఆశయాల వాళ్ళు దాన్ని ఎక్కువ కాలం బతకనివ్వరు. అతనికి డబ్బున్న వాళ్ళన్నా, డబ్బున్న వాళ్ళ మీద గౌరవం ఉన్న వాళ్ళన్నా తగని ద్వేషం. ప్రపంచం మారాలంటాడు. అలా అనడం, అనుకోవడం ఏవీ బాగుపడే లక్షణం కాదని గుడ్ బై చెప్పింది తను.

ఇప్పుడు ఇంజనీరు...నెంబర్ వన్ మాన్.

ఆఫీసులో కాళ్ళు టేబుల్ మీద పెట్టి కూర్చున్నాడు ఇంజనీర్. కిసాన్ ఫర్టిలైజర్స్ మేనేజరు కూతురు గుర్తొచ్చింది. ఆమెతోపాటు ఇంకా చాలా మంది గుర్తొచ్చారు.

సుందరి...ఆస్తీ, స్టేటస్ ఉంది. బంధుత్వం కూడా ఉంది కాని, దానికి అందంలేదు, చదువు రాదు...రేడియోలో ఎవరో కూర్చొని మాట్లాడతారని ఇవాల్టికీ నమ్ముతుంది. బూడిద గుమ్మడికాయలా ఉంటుంది. దాన్ని తనెప్పుడూ ప్రేమించలేదు. అది మాత్రం మగాళ్ళనందర్నీ ప్రేమించగలదు.

"రేఖ...అందం, చదువు ఉన్నాయికాని, ఆస్తి లేదు...ఫాదర్ చెప్పినట్టు బీదపిల్ల. ఆదర్శం కోసం చేసుకుంటే ఆమె తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ చదివించాలి.. ఆమె తండ్రికి ప్రతినెలా ఎం.వో.లు పంపాలి. లేనిపోని తలనొప్పి. ఆదర్శం కోసం వెళ్తే లాభం లేదు మరి...

విశాల...ఆస్తీ, అందం, చదువు, స్టేటస్ ఉన్నాయి కాని, విమెన్స్ లిబ్ మనిషి. ఆడాళ్ళకి స్వేచ్ఛ కావాలంటుంది, అక్కడికి మగాళ్ళకి స్వేచ్ఛ ఉన్నట్టు. ఇలాంటి వాళ్ళు తాము సుఖపడరు, మనల్ని సుఖపెట్టరు...ఏది మాట్లాడినా, చేసినా 'నాకీ ఇంట్లో స్వేచ్ఛ లేద'ని అంటుంది. అబ్బే...లాభం లేదు.

ఇప్పుడు మేనేజరు కూతురు...ఆల్ ఇన్ వన్... కులం దగ్గర్నుంచి చెవి రింగుల దాకా అన్నీ వచ్చాయి.

సముద్రం మీద చిరుచీకటి...

ఆకాశంలో ఎర్రని చంద్రుడు...

కాళ్ళకింద ఇసుక...సముద్రపు హోరు...నాటు పడవ చాటున అన్నాడతను –

"ఐలవ్ యూ డార్లింగ్''

"ఐ టూ డియర్'' అందామె.

